క్లుప్తంగా

క్రీడాకారుడికి కాంస్య పతకం



అఖిల్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థి అఖిల్ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ మంగ తెలిపారు. ఆగస్టు 30, 31 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడన్నారు. అఖిల్‌ను కళాశాల అధ్యాపకులు, ఏటీపీ తిరుమల, పీడీ రాజేశ్, విద్యార్థులు అభినందించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



శశివర్ధన్‌ను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించగా 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. రివిలేషన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి నాగుల శశివర్ధన్ జిల్లాస్థాయి యోగా పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు సాధించి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థిని సోమవారం రివిలేషన్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ రాపోలు విష్ణువర్ధన్ రావు, ప్రిన్సిపాల్ మద్దెర్ల ప్రశాంత్‌లు శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థి తల్లిదండ్రులు నాగుల శ్రీనివాస్–సౌందర్య, కోచ్ అరుణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ ఉద్యోగుల నిరసన

కాసిపేట: తెలంగాణ మోడల్‌స్కూల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 776మంది ఉద్యోగులు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు ప్రిన్సిపాల్ ఖలీల్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.

పంట నష్టంపై రీ సర్వే



కలమడుగులో రైతులతో ఏఈవో దివ్య

సాక్షి ఎఫెక్ట్..

జన్నారం: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు పంట నష్టపోయిన గ్రామాల్లో సోమవారం వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. ఈ నెల 1న 'సాక్షి' దినపత్రికలో చేను చెరువై..! అనే శీర్షికన కథనం ప్రచురితం కాగా, వ్యవసాయ శాఖ అధికారి సంగీత, ఏఈవో దివ్య స్పందించారు. పంట నష్టపోయిన తపాలపూర్, తిమ్మాపూర్, రాంపూర్, కలమడుగు, బాదంపల్లి గ్రామాల్లో పర్యటించారు. పంట నష్టంపై రీ సర్వే చేశారు. 912ఎకరాల్లో వరి పంట, 391ఎకరాల్లో పత్తి పంట, 40ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారి సంగీత తెలిపారు.

గణపతి నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

బెల్లంపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ అధికారులను ఆదేశించారు. పోచమ్మచెరువు వద్దకు వెళ్లి సోమవారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందస్తు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. వీరి వెంట బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్, తహసీల్దార్ ఎల్.కృష్ణ, బెల్లంపల్లి రూరల్ సీఐ హన్మోక్ ఉన్నారు.

త్వరలోనే డబుల్‌బెడ్ రూం ఇళ్ల పట్టాలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మందమర్రి తహసీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. పాత పోలీస్‌స్టేషన్ వద్ద గల డబుల్ బెడ్ రూం ఇళ్లను సోమవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.కోటి 60లక్షలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. త్వరలో పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: కొమ్మెరలో రోడ్డు దుస్థితి



కన్నెపల్లి మండల కేంద్రంలో అధ్వానంగా రోడ్డు



భీమారం: స్తంభాలు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



చెన్నూర్: లైన్‌గడ్డ వెళ్లే దారిలో..



గణేశా.. జర పైలం!

- వర్షాలకు గుంతలమయమైన రోడ్లు..
- వినాయక నిమజ్జనానికి దారి కష్టాలు..
- తక్షణ మరమ్మతుకు భక్తులు, ఉత్సవ కమిటీల డిమాండ్

భీమారం/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/లక్సెట్టిపేట/భీమిని/చెన్నూర్/మంచిర్యాలటౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో నిమజ్జన వేడుకలు జరగనుండగా అధికారులు, పాలకులు ఏర్పాట్లపై అశ్రద్ధ చూపుతున్నారు. వర్షాలకు రోడ్లు గుంతలమయం కాగా, భక్తులకు, ప్రజలకు దారి కష్టాలు తప్పేలా లేవు..! తక్షణమే మరమ్మతు చేయాలని ఉత్సవ కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి.

- మంచిర్యాల నగరంలోని ప్రధాన రహదారులు మినహా పలు కాలనీల్లోని రహదారులు గుంతలమయంగా మారాయి. హైటెక్ సిటీ కాలనీ, గ్రీన్ సిటీ, వికాస్‌నగర్, లక్ష్మీనగర్, పాతమంచిర్యాల, శ్రీలక్ష్మీనగర్, ఆండాళమ్మకాలనీ, ఎన్టీఆర్‌నగర్ కాలనీ, శ్రీశ్రీనగర్, రాజీవ్‌నగర్, గోపాల్‌వాడ, తిలక్‌నగర్, చున్నంబట్టివాడ, బృందావనం కాలనీ, సాయికుంట కాలనీల్లోని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలుగా మారాయి. ఏటా చేపట్టే వినాయక నిమజ్జనానికి ముందురోజు తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులు కాకుండా, వచ్చే వర్షాకాలం వరకు ఆగేలా రోడ్లకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



దండేపల్లి: ద్వారకలో కోతకు గురైన రోడ్డు

- ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దండేపల్లి మండలం ద్వారక తీరంలో గోదావరి ఉప్పొంగడంతో ద్వారక నుంచి గోదావరికి వెళ్లే రోడ్డు భారీగా కోతకు గురైంది. దీంతో నది వద్దకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, కోతకు గురైన చోట తాత్కాలిక మరమ్మతులు చేయించి వాహనాలు వెళ్లేలా చేయాలని పలువురు కోరుతున్నారు.
- చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామంలో వినాయకుడిని స్థానిక చెరువులో నిమజ్జనం చేస్తారు. రోడ్డు బురదమయంగా మారి అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.
- లక్సెట్టిపేట మండలంలో గోదావరి నది వద్ద, కొన్ని విగ్రహాలను గూడెం సమీపంలోని గోదావరి వద్ద నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- భీమారం మండల కేంద్రంలో వినాయక నిమజ్జనం కోసం రోడ్లపై తీగలు తగలకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కిందకు ఉన్న లైన్లను, పాత స్తంభాలను తొలగించి, 9 మీటర్ల స్తంభాలను ఏర్పాటు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.
- కన్నెపల్లి మండల కేంద్రం నుంచి నిమజ్జనానికి తరలించే సుమారు రెండు కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని భక్తులు కోరుతున్నారు.

చెన్నూర్ మున్సిపాలిటీలో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు నామమాత్రంగా సాగుతున్నాయి. గుంతలమయంగా ఉన్న ప్రాంతాల్లో కంకర చిప్స్ వేశారు. కంకర చిప్స్ పూర్తి స్థాయిలో వేయకపోవడంతో నేటికీ అక్కడక్కడ గుంతలే దర్శనమిస్తున్నాయి. నిమజ్జన ఘాట్ వద్ద చెరువులో చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. గణేశ్ నిమజ్జనానికి మూడు రోజుల గడువు ఉండడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పట్టణంలో గుంతలు పూడ్చి, అపరిశుభ్రంగా ఉన్న నిమజ్జన ఘాట్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గణేశ్ మండపాల నిర్వాహకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు.







మంచిర్యాల నగరంలోని గ్రీన్‌సిటీ కాలనీలో, రాంనగర్‌లో గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి

సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. మంచిర్యాలలోని సాయికుంట కాలనీవాసులు కోతుల బెడద నివారించాలని ఫిర్యాదు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో వచ్చినా ఇల్లు మంజూరు కాలేదని బెల్లంపల్లి మండలం అంకుశం గ్రామానికి చెందిన పిట్టల సునంద, చెన్నూర్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన రామగిరి కిష్టయ్య దరఖాస్తు అందజేశారు. జిల్లాలో దళితులపై దాడులు అరికట్టాలని, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు బొజ్జ శరత్, నక్క శ్రీనివాస్, తీగల శ్రీనివాస్ కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాలేదు



మొదటి, రెండవ, మూడవ ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రాలేదు. ఆధార్‌కార్డు నంబరు తప్పుగా ఉందని, భార్యకు బదులు భర్తకు ఆధార్‌కార్డు నమోదైందని తదితర కారణాలతో బేస్‌మెంట్ వేసుకున్నాక రావడం లేదు. స్లాబ్ పూర్తయిన బిల్లు రాలేదు. ఇప్పటికే కలెక్టరేట్‌లో రెండుసార్లు ఫిర్యాదు చేశాం. ఇప్పుడేమో హైదరాబాద్ పెద్ద ఆఫీసుకు పొమ్మంటున్నారు.

– ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, దుబ్బగూడెం, భీమిని

గ్రామాల్లోనే పెన్షన్ అందించాలి

రామకృష్ణాపూర్: మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామాల ప్రజలు వేరే గ్రామానికి వెళ్లి ప్రతీ నెల పెన్షన్ తీసుకోవటానికి ఇబ్బందులు పడుతున్నారని, స్థానికంగానే పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మంచిర్యాలటౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం ఇంచార్జి డీఎంహెచ్‌వోగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఇంచార్జి డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కీటక వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటివి ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, డెమో బుక్క వెంకటేశ్వర్, డీపీహెచ్ ఎన్ వేదవతి, సావిత్రి, రాణి, కాంతారావు, సంతోష్ పాల్గొన్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన అనంతరం అనిత కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి మొక్క అందజేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక మార్క్స్‌భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వ విద్యారంగం బలోపేతం, న్యాయమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని సూచించారు. వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించటం, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచటం, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయటం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఉపాధ్యక్షులు సికిందర్, రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో 'హంటర్'పై అవగాహన

కాసిపేట: అడవిలో చెట్లు నరికినా, వన్య ప్రాణులను వేటాడినా హంటర్ పట్టుకుంటుందని అటవీ శాఖ అధికారులు గ్రామస్తులను హెచ్చరించారు. మండలంలోని బెల్లంపల్లి రేంజ్ పరిధి ముత్యంపల్లి, ధర్మరావుపేట సెక్షన్‌లలోని బుగ్గగూడ, చింతగూడ, వెంకటపూర్ గ్రామాల్లో సోమవారం అటవీశాఖ ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్ సిబ్బంది తన బెల్జియం సంతతి జాగిలం హంటర్, తానుచేసే పని గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది అనిల్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, బీట్ ఆఫీసర్ శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్

రోడ్డుపై నీరు.. ప్రజలు బేజారు

భీమారం: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. ఆవిడం–భీమారం ప్రధాన రహదారిలో రోడ్డు పై నుంచి వరద నీరు ప్రవహించడటంతో గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి.



బల్దియా ఉద్యోగుల నిరసన

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం సీపీఎస్ ఉద్యోగులు సోమవారం పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించారు. మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి సామూహికంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎండీ మజార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దే ప్రసవం

కాసిపేట: మందమర్రి దీపక్‌నగర్‌కు చెందిన మహిళకు కాసిపేట 108అంబులెన్స్ సిబ్బంది సోమవారం ఇంటి వద్ద ప్రసవం చేసి ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ ఆత్మరావు కథనం ప్రకారం.. దీపక్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ భార్య అఖిలకు పురిటినొప్పులు రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. ప్రసవానికి తరలించేందుకు వెళ్లగా అప్పటికే నొప్పులు తీవ్రమై ప్రసవం జరిగే అవకాశం ఉండటంతో ఇంటి వద్ద ప్రసవం చేసినట్లు, ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు.

చెరువులో కరెంటు కనెక్షన్



మందమర్రిరూరల్: మండలంలోని మామిడిగట్టు గ్రామ సమీపంలో ఊరచెరువులో గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోర్‌వెల్ ఉంది. ఇటీవల కనెక్షన్ తెగిపోయింది. దీంతో గ్రామానికి రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తుడు అప్సర్, గ్రామ పంచాయతీ కారోబార్ కిషన్ కలిసి సోమవారం ఆ చెరువులోకి వెళ్లి విద్యుత్ కనెక్షన్ సరిచేశారు.

బొగ్గుబాయి వార్తలు

శ్రీరాంపూర్‌లో 84శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా గనుల్లో ఆగస్టు నెల 84శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు నెల నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 4.83లక్షల టన్నులకు గాను 4.05లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. ఏప్రిల్ 1నుంచి ఆగస్టు 31నాటికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 26.32లక్షల టన్నులకు గాను 23.90లక్షల టన్నులు సాధించి 91శాతం ఉత్పత్తి లక్ష్యం నమోదైందన్నారు. ఏరియాలోని ఆర్కే న్యూటెక్, ఆర్కే 7, ఎస్సార్పీ 1, ఐకే ఓసీపీలు నూరు శాతం మించి ఉత్పత్తిని సాధించినట్లు తెలిపారు. వర్షాల వల్ల ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిందన్నారు. ఆగస్టు నెలలో ఓసీపీలో 466ఎంఎం వర్షపాతం నమోదైందన్నారు. 18రెయిన్స్ డేస్ నమోదయ్యాయన్నారు. శ్రీరాంపూర్ ఏరియా ఆధ్వర్యంలో ఆదివారం కంపెనీ స్థాయి 55వ భద్రత పక్షోత్సవాల బహుమతి ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో 90మందికి క్యాడర్ ప్రమోషన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 36శాతం...

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో గత మాసంలో 36శాతం బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ తెలిపారు. జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేకే–5గనిలో 3,808టన్నులు, కాసిపేట 11,430టన్నులు, కాసిపేట–2గనిలో 11,242టన్నులు, శాంతిఖనిలో 5,222 టన్నులు, కేకే–ఓసీలో 31,265టన్నులు ఓవరాల్‌గా 72,967టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగినట్లు వివరించారు. వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగిందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి పర్సనల్ మేనేజర్ ఆసీఫ్, ఐఈడీ కిరణ్‌కుమార్, సీనియర్ పీవో శంకర్ ఉన్నారు.

క్యాడర్ స్కీం ప్రమోషన్ ఆర్డర్స్ అందజేత

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్లు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన వారికి సోమవారం జీఎం ఆఫీస్ ఆవరణలో క్యాడర్ స్కీం ఆర్డర్స్‌ను ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్ అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్అండ్‌ఏ ఆర్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, సీనియర్ పీవో వంశీ, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు ఉన్నారు.

కాసిపేట: కార్మికులు పదోన్నతులతో సంస్థకు మరింత ప్రయోజనం చేకూర్చేల పనితీరు కనబర్చాలని మందమర్రి ఏరియా కాసిపేట గని మేనేజర్ సతీశ్ తెలిపారు. గనిపై సోమవారం క్యాడర్ ప్రమోషన్లు పొందిన కార్మికులకు పదోన్నతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, రక్షణాధికారి నిఖిల్, డెప్యూటీ మేనేజర్ వెంకటేష్, సంక్షేమాధికారి మీర్జా జీశాన్ తదితరులున్నారు.

నిర్దేశిత లక్ష్యం సాధించాలి

జైపూర్: ఐకే ఓసీపీలో ఈ ఆర్థిక సంవత్సరం సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు సూచించారు. జైపూర్ మండలంలోని ఇందారంలో గల ఐకే–1ఏ, ఓసీలను సోమవారం శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఓసీలో ఈ ఏడాది 15లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని తెలిపారు.

కోతకు గురైన రోడ్డు..!

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ నుంచి జెండా వెంకటాపూర్‌కు వెళ్లే సీసీ రోడ్డు వర్షాలకు కోతకు గురై సిమెంట్ పైపులు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జెండావెంకటాపూర్, ఆదిల్‌పేట్, మందమర్రి, జైపూర్ వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



సంక్షిప్త వార్తలు

కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ ఇవ్వాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో పనిచేస్తున్న 132 మంది పారిశుద్ధ్య కార్మికులకు కొన్నేళ్లుగా పీఎఫ్, ఈఎస్‌ఐ వేతనాల నుంచి కట్ చేస్తున్నారని, జమ చేసిన డబ్బులను పీఎఫ్ ఖాతాల్లో వేయడం లేదంటూ మంచిర్యాల జిల్లా మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు కమిషనర్ సంపత్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు చేయాలి

మంచిర్యాలటౌన్: ఈ నెల 6న మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో గణపతి నిమజ్జనం నిర్వహించనున్నట్లు, నగరంలోని గతుకుల రోడ్లను పూడ్చి, ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించి, విద్యుత్ తీగల సమస్యలు లేకుండా చూడాలని హిందూ ఉత్సవ సమితి సభ్యులు సోమవారం కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

గణనాథుడికి పూజలు

లక్సెట్టిపేట/దండేపల్లి/చెన్నూర్‌రూరల్: వినాయక మండపాల వద్ద భక్తులు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లక్సెట్టిపేట బీట్‌బజార్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం 130రకాల నైవేద్యాలు వినాయకుడికి సమర్పించారు. దండేపల్లిలో యువచైతన్య యూత్ ఆధ్వర్యంలో 108దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. కిష్టంపేటలోని హనుమాన్ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శ్రీరాంపూర్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్‌ఎస్వీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నస్పూర్ కాలనీ జాతీయ రహదారిపై సోమవారం తెలంగాణ తల్లి విగ్రహానికి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పాతమంచిర్యాల: రక్తదానం ప్రాణదానంతో సమానమని లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు కో ఆర్డినేటర్ ఫర్ బ్లడ్ డొనేషన్ క్యాంప్స్ ఇన్‌చార్జి వి.మధుసూదన్ రెడ్డి అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న 28ఏళ్ల మహిళ ఎండీ సోనికి సోమవారం 'ఏబీ' నెగిటివ్ రక్తం దానం చేసినట్లు వివరించారు.

ఆదివాసీ గూడేల్లో పర్యటన

కాసిపేట: మండలంలోని దేవాపూర్, గట్రావుపల్లి, రేగులగూడ, జెండాగూడ, సాలేగూడ, సోనాపూర్, వెంకటపూర్, లక్ష్మీపూర్, కుర్రెఘడ్ గూడేల్లో సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పర్యటించారు.